MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 359 | సోమవారం 8 డిసెంబర్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-




# వెంటిలేటర్‌పై ఉన్న ఏపీని బయటపడేశాం



- ప్రకాశం సహా రాయలసీమ జిల్లాల్లో ఉద్యాన క్లస్టర్ ఏర్పాటు
- పరకామణిలో డబ్బులు కొట్టేస్తే చిన్న నేరం అని అంటారా?
- వైఎస్సార్‌సీపీ నేత జగన్‌పై సీఎం చంద్రబాబు ధ్వజం
- ప్రతి త్రైమాసిక, ఆర్థిక ఏడాది రాష్ట్ర స్థూల ఉత్పత్తి పర్యవేక్షిస్తున్నాం
- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు

**అమరావతి**

గత వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన తప్పిదాల వల్ల వెంటిలేటర్‌పై ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను బయపడేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. విభజన కారణంగా వ్యవస్థీకతంగా ఆంధ్రప్రదేశ్ కు ఇబ్బందులు వచ్చాయి. 25 ఏళ్ల క్రితం రూపొందించిన పాలసీల కారణంగా తెలంగాణా రాష్ట్రం ఇప్పుడు ఆదాయం సాధిస్తోంది. విభజన తర్వాత వ్యవస్థీకతంగా ఏపీకి వచ్చిన ఇబ్బందులను సరి చేసే సమయంలో వైసీపీ వచ్చి రాష్ట్రాన్ని విధ్వంసం చేసింది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, విద్యుత్ సహా వివిధ మౌలిక సదుపాయాలు కల్పించటం వల్ల పరిశ్రమల రంగంలో వద్ధి నమోదైంది. రాష్ట్రంలో నీటి భద్రత, అగ్రిటెక్, లాజిస్టిక్స్ వ్యయం తగ్గింపు, ప్రాడెక్టు పర్ఫెక్షన్, డీప్ టెక్ లాంటి 10 సూత్రాలను సమర్ధంగా అమలు చేస్తున్నాం. బిల్ గేట్స్ ఫౌండేషన్ ద్వారా రాష్ట్రంలో అగ్రిటెక్ అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో రైతు సేవా కేంద్రం వారీగా వ్యవసాయ యాక్షన్ ప్లాన్ తయారు చేస్తున్నాం. ప్రకాశం సహా 9 రాయలసీమ జిల్లాల్లో ఉద్యాన క్లస్టర్ గా తయారు చేస్తున్నాం. పరకామణిలో డబ్బులు కొట్టేసిన వ్యవహారాన్ని చిన్న నేరం అని చెప్పడాన్ని ఏమనాలి. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయంలోనే చోరీ జరిగితే అది చిన్నదని ఎలా సమర్థిస్తారు. కల్తీ నెయ్యి స్వామివారి ప్రసాదం తయారీకి సరఫరా చేసిన ఘటనను వెనకేసుకు వస్తారా. ఇలాంటి వాటిన సమర్థిస్తున్న వ్యక్తులు ప్రతిపక్షంలో ఉన్నారు. ఇలాంటి వారితో రాజకీయం చేయడానికి నాకు సిగ్గు అనిపిస్తోంది. అదేవిధంగా 2025%-%26 ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికానికి నమోదైన జీఎస్డీపీ వద్ధిరేటు%-% రంగాల వారీగా వెల్లడించిన - మిగతా 3లో

# తెలంగాణ ప్రత్యేక విజన్‌తో ముందుకెళ్తోంది

- వికసిత్ భారత్ దిశగా తెలంగాణ రైజింగ్ కొనసాగుతోంది
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం
- తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి



**హైదరాబాద్**

నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ ముందుకెళ్తోందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వెల్లడించారు. సోమవారం ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ వర్మ మాట్లాడు తూ.. వికసిత్ భారత్ దిశగా తెలంగాణ రైజింగ్ కొనసాగుతోం దన్నారు. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. మహిళా రైతులను పలు విధాలుగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. బస్సుల నిర్వహణ కూడా మహిళా సంఘాలకు ఇచ్చామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తెలంగాణలో స్థిరమైన, - మిగతా 3లో

# పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరించారు



**అమరావతి**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవల చేసిన “కోన సీమకు తెలంగాణ నేతల దిష్టి తగిలింది” అనే వ్యాఖ్యలు ఎంతటి రాజకీయ దుమారం రేపాయో తెలిసిందే. తెలంగాణ మంత్రులు ముక్తకంఠంతో పవన్ వ్యాఖ్యలను ఖండించారు. విపక్ష నేతలు కూడా పలువురు పవన్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఈ నేపథ్యంలో ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను కొన్ని వర్గాలు ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తున్నాయని అన్నారు. పవన్ కల్యాణ్ ఎటువంటి దురుద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. కేవలం రైతులతో మాట్లాడే సందర్భంలో మాత్రమే అలా అన్నారని వివరించారు. - మిగతా 3లో

# వందే భారత్ స్లీపర్ వచ్చేస్తోంది!



- తొలి రైలు నడిచేది ఈ మార్గంలోనే..!
- ఈ రైలు సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని అందించనున్నాయి
- తేజస్ రైలు తరహాలో వేగంగా.. రాజధాని రైలు లాంటి సౌకర్యాలు కలిగిన తొలిరైలు ఢిల్లీ-పాట్నా మార్గంలో నడువనున్నది
- ఈ రైలు ప్రారంభోత్సవానికి సంబంధించిన పనులన్నీ తుది దశలో ఉన్నాయి




# భారత క్రికెట్‌కు మెరిసిన నక్షత్రం కుమారి దీపికా

- కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని మంత్రి సవిత
- దీపికా ప్రతిభకు గుర్తింపుగా ?2,00,116 ఆర్థిక ప్రోత్సాహం ప్రకటించిన మంత్రి

**అంకుశం ప్రతినిధి పెనుగొండ డిసెంబర్ 7**

భారత క్రికెట్‌కు మెరిసిన నక్షత్రం కుమారి దీపికా అని మంత్రి సవితమ్మ అన్నారు. మన జిల్లాకే గర్వకారణమైన భారత అంధ మహిళల క్రికెట్ టీమ్ కెప్టెన్ కుమారి దీపికా అంతర్జాతీయ స్థాయిలో భారత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశ ప్రజల ప్రశంసలు అందుకుంటోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామితో కలిసి మడకశిరలో ఘనమైన అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సవితమ్మ హాజరయ్యారు. ముందుగా మడకశిర ప్రధాన వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించగా, అనంతరం కళాశాల మైదానంలో అభినందన సభ నిర్వహించారు. సభలో మంత్రి సవిత మాట్లాడుతూ దీపికా మన అందరికీ ఆదర్శమన్నారు. “దృష్టిలోపం ఉన్నప్పటికీ దృఢ సంకల్పం, క్రమశిక్షణ, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని దీపికా నిరూపించింది. మడకశిర గర్వకారణమైన ఈ ముద్దుబిడ్డ ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రతిష్ఠను మరొకసారి నిలబెట్టింది” అని మంత్రి ప్రశంసించారు. దీపికా కృషికి గుర్తింపుగా ?2,00,116 ఆర్థిక ప్రోత్సాహాన్ని ప్రకటించారు. క్రీడాకారుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, పల్లె సిందూర రెడ్డి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, సినీ నటుడు సాయి కుమార్, కర్ణాటక స్వచ్ఛంద సంస్థల వ్యవస్థాపకులు మహంతేష్, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# 37 మంది ఎమ్మెల్యేలు మారలేదు..

**విజయవాడ :** ఎమ్మెల్యేల పనితీరుపై సీఎం నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. వన్ టూ వన్ భేటీల తర్వాత ఎమ్మెల్యే పనితీరు మెరుగైందని చంద్రబాబు అన్నారు. 37 మంది శాసనసభ్యులు మినహా మిగతా అందరి పనితీరు మెరుగుపడిందని.. ఓ 37 మంది ఎమ్మెల్యేల పనితీరు ఇంకా మెరుగుపడాల్సి ఉందన్నారు. ప్రతి ఎమ్మెల్యే పనితీరుపైనా సర్వే నివేదికలు తెప్పించుకుంటున్నానన్న చంద్రబాబు.. పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. శనివారం రోజున టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ నేతలతో చంద్రబాబు భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. బీజేపీ కోసం ఆర్ఎస్ఎస్ ఎలా నిస్వార్థంగా పనిచేస్తోందో.. అదే తరహాలో ఓ సిద్ధాంతం ప్రకారం పార్టీ క్యాడర్‌ను సంసిద్ధం చేసుకోవాలని నేతలకు సూచించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీరుపైనా చంద్రబాబు చర్చించారు. వైఎస్ జగన్ అర్థం పర్థం లేకుండా మాట్లాడే మాటలు పట్టించుకోవద్దని సూచించారు. విజ్ఞత కోల్పోయి మాట్లాడుతున్న మాటలకు విలువ లేదన్న చంద్రబాబు.. ప్రజలే వారికి బుద్ధి చెబుతారని అన్నారు. మీడియాతో చిట్ చాట్ సందర్భంగా సీఎం చంద్రబాబు తిరుమల పరకామణి కేసుపై కీలక వ్యాఖ్యలు చేశారు. పరకామణిలో రూ.70వేల చోరీ చేసి.. రూ.14కోట్ల ఆస్తి రాసిచ్చేందుకు సిద్ధమయ్యారంటే ఎంత సంపాదించి ఉండొచ్చని చంద్రబాబు ప్రశ్నించారు. పరకామణి కేసులో వైఎస్ జగన్ శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడారని చంద్రబాబు విమర్శించారు, వైఎస్ జగన్‌కు దేవుడు అన్నా, భక్తుల మనోభావాలు అన్నా పట్టింపులేదని.. దొంగతనాన్ని కూడా తప్పు కాదనే వాళ్లను ఏమనాలని చంద్రబాబు ప్రశ్నించారు. నేరస్తుల్ని వెనకేసుకొస్తూ సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని మండిపడ్డారు. తిరుమల శ్రీవారి భక్తులు, ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని చంద్రబాబు అన్నారు.మరోవైపు ఏపీలో లేడీ డాన్ల వ్యవహారం చర్చనీయాంశమవుతున్న వేళ చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. నెల్లూరులో అరుణ, అరవ కామాక్షి వ్యవహారం చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో లేడీ డాన్ల విషయంపై చంద్రబాబు మీడియాతో చిట్ చాట్ సందర్భంగా స్పందించారు. వైసీపీ హయాంలో నెల్లూరులో మాఫియా చాపకింద నీరులా విస్తరించిందని ఆరోపించారు. లేడీ డాన్లు తయారు కావటం ఆశ్చర్యమేసిందన్న చంద్రబాబు..నేరాలకు పాల్పడే వారి తోకలు కట్ చేస్తామని హెచ్చరించారు.అమరావతిలో సమస్యలు పరిష్కారమై ప్రశాంతంగా ఉంటే.. కొంతమంది తట్టుకోలేకపోతున్నారన్న చంద్రబాబు... రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇక టీడీపీ హయాంలో హైదరాబాద్ అభివృద్ధి చెందిందన్న వాస్తవాన్ని తెలంగాణలో అధికారంలో ఉన్న పార్టీలు కూడా గుర్తిస్తున్నాయన్న చంద్రబాబు..
పరోక్షంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించారు.

ఏపీలో జోనల్ వ్యవస్థ

ఏపీ సమగ్రాభివృద్ధి కోసం ప్రత్యేకంగా జోన్ వ్యవస్థను తీసుకొస్తామని చెబుతున్నారు. బాబు నో మూడు జోన్లు అన్న మాట రావడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. గతంలో వైసీపీ తెచ్చిన మూడు రాజధానుల ఫార్ములాకు కౌంటర్‌గానే జోన్ స్లోగన్ అందుకున్నారన్న టాక్ వినిపిస్తోంది.మళ్లీ ఫ్యూచర్‌లో కూడా ఆర్థిక, న్యాయ, పరిపాలనా రాజధాని అని లేనిపోని రచ్చ లేకుండా..డెవలప్‌మెంట్ మోడల్‌తో జోన్ సిస్టమ్‌కు ప్రపోజల్ రెడీ చేస్తున్నారట. అభివృద్ధి కోసమే జోన్ వ్యవస్థ అని బాబు చెప్తున్నప్పటికీ..వైసీపీని పూర్తిగా కార్నర్ చేయడానికే అన్న చర్చ అయితే జరుగుతోంది. అయితే మూడు ప్రాంతాలను మూడు జోన్లుగా చేసి..స్పెషల్ బోర్డు..స్పెషల్ ఆఫీసర్లను కూడా పెట్టేందుకు అంతా సిద్ధమవుతోందట. అభివృద్ధి పనులు, పెట్టుబడులు, ప్రాజెక్టులపై ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేస్తూ.. ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయం ఇంప్లిమెంట్ అయ్యేలా మాస్టర్ ప్లాన్ రెడీ చేస్తున్నారట. విశాఖ, అమరావతి, రాయలసీమను ఆర్థిక జోన్లుగా డివైడ్ చేసి..ప్రతీ జోన్‌కు మూడు కమిటీలు ఉండేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు చెబుతున్నారు. విశాఖ జోన్‌లోకి ఉత్తరాంధ్రలోని 9 జిల్లాలు..అమరావతి జోన్‌లోకి 8 జిల్లాలు, రాయలసీమ జోన్‌లోకి 9 జిల్లాలు రాబోతున్నాయి. రాయలసీమ జోన్‌కు తిరుపతి కేంద్రంగా ఉండబోతోంది. మూడు ఎకనామిక్ జోన్లకు కలిపి సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఓ స్టీరింగ్ కమిటీ కూడా ఉండేలా వ్యూహరచన చేస్తున్నారట.అభివృద్ధి ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకూడదనేదే తమ ఆలోచన అంటున్నారు చంద్రబాబు. రాష్ట్రంలో మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రకటించారు. రీజనల్ బోర్డులతో అభివృద్ధి అన్ స్టాపబుల్‌గా కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు. ఏపీలో గతంలో ఉన్న 13 జోన్ల వ్యవస్థను మార్చి, మూడు ప్రధాన జోన్లుగా చేయాలనే ప్రతిపాదన చర్చలో ఉంది. 2024 ఎన్నికల్లో టీడీపీ మ్యానిఫెస్టోలో ఈ అంశాన్ని ప్రస్తావించారుఇప్పుడు అమల్లోకి తెచ్చే ప్లాన్ చేస్తున్నారు. ఉత్తరాంధ్ర జోన్‌లో పోర్టులు, టూరిజం, ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్‌పై ఫోకస్ చేయనున్నారట. కోస్తా జోన్‌లో రాజధాని అమరావతి అభివృద్ధి, అగ్రికల్చర్, ఎ హబ్‌లు వంటి అంశాలు కీలకంగా కానున్నాయి. రాయలసీమ జోన్‌లో మ్యానుఫ్యాక్చరింగ్ సెక్టార్‌తో పాటు ప్రాజెక్టులు, ఇన్వెస్ట్‌మెంట్లను అట్రాక్ట్ చేసే వ్యూహం ఉందట. ప్రతి జోన్‌కు సెపరేట్ బడ్జెట్, మానిటరింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తామంటోంది సర్కార్.పబ్లిక్ అటెన్షన్ గ్రాబ్ చేసేలా రీజనల్ బోర్డులపై టైమ్ చూసి లీకులు ఇచ్చారని అంటున్నారు. వైసీపీ మూడు రాజధానుల ఫార్ములా ఎలాగూ సక్సెస్ కాలేదు. కానీ కూటమి ప్రభుత్వం అమరావతి కేంద్రంగానే అభివృద్ధి చేస్తోందన్న విమర్శ ఉంది. అందుకే చంద్రబాబు రీజనల్ బోర్డుల ఏర్పాటుకు ప్లాన్ చేశారని అంటున్నారు. వైసీపీ మూడు రాజధానుల ఎజెండాకు కౌంటర్‌గా..జోన్ నినాదం ఎత్తుకున్నారని చెప్పుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతిలో డెవలప్‌మెంట్‌ను స్పీడప్ చేశారు.రాజధాని పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలనే ఆలోచనలో ఉన్నారు. అయితే అమరావతి రాజధాని అభివృద్ధి చేస్తూనే ఏపీలో మూడు ప్రాంతాల ఈక్వల్‌గా డెవలప్ చేయాలన్న స్టాండ్‌తో బాబు ముందుకు రావడం హాట్ టాపిక్ అవుతోంది.ఏపీలో అమరావతిని మాత్రమే అభివృద్ధి చేసి మిగిలిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారని వైసీపీ విమర్శలు చేయకుండా..అపోజిషన్‌కు అసలు చాన్సే ఇవ్వొద్దన్న ఆలోచనతో బాబు ఉన్నారట. అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి..పెట్టుబడులు..ఒక్క మాటలో చెప్పాలంటే అభివృద్ధి వికేంద్రీకరణ అన్నట్లుగా రీజనల్ బోర్డులను తెస్తున్నారట. బాబు చెబుతున్న మూడు జోన్ల నినాదం ఏపీ రూపురేఖలను మారుస్తుందా లేదా అనేది వేచి చూడాలి.

# సాగర తీరంలో రియల్ బూమ్



**విశాఖపట్టణం :** సాగరతీరం విశాఖపట్నం అభివృద్ధి మీద ఏపీ ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. దీంతో విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయి. దీంతో విశాఖలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటోంది. అయితే నిర్మాణ రంగాన్ని సిబ్బంది కొరత వేధిస్తోందని బిల్డర్లు చెప్తున్నారు. మౌలిక వసతుల ప్రాజెక్టులలో పురోగతి ఉన్నప్పటికీ.. నైపుణ్యం కలిగిన సిబ్బంది సరైనంతగా లేకపోవటంతో అమల్లో జాప్యం జరుగుతోందని చెప్తున్నారు. దీంతో ఖర్చులు పెరుగుతున్నాయని వెల్లడిస్తు?న్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నం అభివృద్ధి మీద ప్రత్యేక దృష్టి సారించింది. సాగర తీరం విశాఖను ఏపీ ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలోనే విశాఖపట్నానికి జాతీయ, అంతర్జాతీయ సంస్థలు తరలి వస్తున్నాయి. గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ఐటీ సంస్థలు కూడా విశాఖలో పెట్టుబడులు పెడుతున్నాయి. దీంతో విశాఖపట్నం సహా ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా పుంజుకుంటోంది. దీనికి తగినట్లుగానే నిర్మాణ రంగం కూడా పుంజుకుంది. అయితే విశాఖలో నిర్మాణ రంగాన్ని ఓ సమస్య ఇబ్బంది పెడుతోందని నిర్మాణ రంగంలోని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.విశాఖపట్నంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో నిర్మాణ కార్యకలాపాలు పెరుగుతున్నాయి, అయితే నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత కారణంగా విశాఖపట్నం నగర వృద్ధి మందగిస్తోందని బిల్డర్లు అభిప్రాయపడుతున్నారు. స్మార్ట్-సిటీ అప్‌గ్రేడ్‌లు, విమానాశ్రయ విస్తరణ, గృహనిర్మాణ ప్రాజెక్టులలో పురోగతి ఉన్నప్పటికీ.. నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత కారణంగా వీటి అమలు ఆలస్యం అవుతోందని అంటున్నారు. ఫలితంగా ఖర్చులను పెంచుతోందని కాంట్రాక్టర్లు అభిప్రాయపడుతున్నారు. అనుభవజ్ఞులైన మేసన్‌లు, ఎలక్ట్రీషియన్లు, ఫినిషింగ్ కార్మికులు దొరకడం లేదని చెప్తున్నారు. దీంతో ప్రాజెక్టుల నిర్మాణం ఆలస్యమవుతోందని.. ఫలితంగా ఖర్చులు పెరగడమే కాకుండా, చిన్న, మధ్య తరహా సంస్థలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని చెప్తున్నారు.మరోవైపు విశాఖపట్నం నగరంలో మరిన్ని పనులు చేపట్టడానికి బిల్డర్లు సిద్ధంగా ఉన్నప్పటికీ.. నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత వేధిస్తోందని క్రెడాయ్ అధికారులు చెప్తున్నారు. విశాఖపట్నం దాని మౌలిక సదుపాయాల లక్ష్యాలను చేరుకోవాలంటే బలమైన, నమ్మదగిన శ్రామిక శక్తి అవసరమని వెల్లడిస్తు?న్నారు. సిబ్బందిలో పనితనాన్ని మెరుగుపరచడానికి , బిల్డర్లలో విశ్వాసాన్ని పెంపొందించడానికి క్రెడాయ్ నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు.మరోవైపు నైపుణ్యం కలిగిన సిబ్బంది కొరత కారణంగా విశాఖపట్నంలో ఇప్పటికే మున్సిపల్ ప్రాజెక్టుల నిర్మాణాలు మందగించాయి. ముఖ్యంగా రోడ్డు పనులు, పబ్లిక్ హాస్టళ్ల వంటి మునిసిపల్ ప్రాజెక్టులను నెమ్మదించాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాగే ఆలస్యమయ్యే కొద్దీ ఇళ్లు కొనుగోలు చేసే వారిలో విశ్వాసం తగ్గుతుందని రియల్ ఎస్టేట్ డెవలపర్లు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో నైపుణ్యం కలిగిన సిబ్బంది కోసం.. స్కేల్-అప్ అప్రెంటిస్‌షిప్‌లు, కాంట్రాక్టర్-ఇన్‌స్టిట్యూట్ లింకేజీలు, ప్రోత్సాహకాలు వంటివి అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

# సలసలగా మారుతున్న శింగనమల

**అనంతపురం :** శింగనమల నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీలు పోటా పోటీగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఎన్నికలకు ఇంకా మూడేళ్లు సమయం ఉండగానే శింగనమలలో ఎన్నికల హీట్ మొదలయిందని చెప్పాలి. ప్రస్తుత ఎమ్మెల్యే,మాజీ మంత్రి ఇద్దరూ చెరొక పార్టీ తరుపున కార్యక్రమాలను చేపట్టడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో కంటే శింగనమలలో ఇప్పటికే పొలిటికల్ హీట్ పెరిగిందంటున్నారు. అనంతపురం జిల్లాలోని శింగనమల నియోజకవర్గం రిజర్వడ్ నియోజకవర్గం. వచ్చే ఎన్నికల నాటికి ఇది రిజర్వ్ డ్ నియోజకవర్గంగా ఉంటుందని చెప్పలేని పరిస్థితి. ఎందుకంటే నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఈ నియోజకవర్గం ఎలాగైనా మారే అవకాశముంది.అయితే శింగనమలలో గత ఎన్నికల్లో టీడీపీ తరుపున పోటీ చేసిన బండారు శ్రావణి విజయం సాధించారు. వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులుపై గెలుపొందారు. గతంలో ఈ నియోజకవర్గం కాంగ్రెస్ కు కంచుకోట. ఆ తర్వాత వైసీపీకి అడ్డాగా మారింది. 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచిన జొన్నలగడ్డ పద్మావతిని పక్కనపెట్టి జగన్ కొత్త ప్రయోగం చేశారు. ట్రక్కు డ్రైవర్ వీరాంజనేయులును పోటీకి దింపారు. రాష్ట్రమంతటా ప్రచారం చేసుకున్నారు. తాను ట్రక్కు డ్రైవర్ కు సీటు ఇచ్చనని, డబ్బులున్న వారికి ఇవ్వలేదని,సామాన్యులకు తమ పార్టీ పెద్దపీట వేస్తుందని పదే పదే చెప్పారు. కానీ శింగనమల




ప్రజలు వైసీపీ అభ్యర్థిని ఆదరించలేదు. 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన బండారు శ్రావణికే పట్టం కట్టారు.కానీ మాజీ మంత్రి, మాజీ పీసీసీ చీఫ్ సాకే శైలజానాథ్ వైసీపీలో చేరిన తర్వాత ఈ నియోజకవర్గంలో వైసీపీ మళ్లీ పుంజుకుంది. శైలజానాథ్ అక్కడే ఉండి ప్రజా సమస్యలపై స్పందిస్తున్నారు. అరటి రైతులకు గిట్టుబాటు ధర లభించలేదని ఆయన కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగారు. ఇక తాజాగా ఒక రైతు మరణించడంతో దానిపై కూడా వైసీపీ, టీడీపీ రాజకీయాలు చేశాయి. అరటి పంట వేసి నష్టపోయి రైతు చనిపోయాడని వైసీపీ నేతలు చెబుతుంటే, టీడీపీ నేతలు మాత్రం ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకున్నాడని చెబుతున్నారు. రైతు ఆత్మహత్య విషయంలోనూ వైసీపీ, టీడీపీలు రాజకీయంగా తమకు అనుకూలంగా మలచుకోవాలని ప్రయత్నించాయి. రాష్ట్రంలో లేని విధంగా శింగనమలలో రాజకీయ వేడి మూడేళ్ల ముందే ప్రారంభమైంది.

## వెంటిలేటర్‌పై ఉన్న ఏపీని బయపడేశాం

-మొదటిపేజీ తరువాయి

గణాంకాల వివరాలు ఇలా.. ఈ త్రైమాసికంలో వ్యవసాయం%-%అనుబంధ రంగాల్లో జీవీఏ విలువ రూ.1,25,571 కోట్లు, పరిశ్రమల రంగం విలువ రూ.86,456 కోట్లు, సేవల రంగం విలువ రూ.1,60,075 కోట్లు. పరిశ్రమల రంగంలో అనూహ్య ప్రగతి వచ్చింది. 2.78 శాతం నుంచి 12.20 శాతానికి వద్ధి పెరిగి... జాతీయ సగటును దాటింది. వ్యవసాయ రంగంలో 11.43 శాతం, హార్టీకల్చర్ 4.35 శాతం, ఫిషింగ్, ఆక్వాకల్చర్ రంగాల్లో 26.27 శాతం, లైవ్ స్టాక్‌లో 4.18 శాతం వద్ధి రేటు సాధించాం. వరి 3.64 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా... గతంతో పోలిస్తే 23.95 శాత మేర వద్ధి వచ్చింది. అరటిలో అనూహ్యంగా 37.31 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. గతంతో పోలిస్తే ఇది 151.2 శాతం అధికం. మత్స్య దిగుబడి 17.30 శాతం, రొయ్యలు 27.09 శాతం మేర పెరిగింది. గుడ్లు 6.68 శాతం, మీట్ 7.95 శాతం పెరగ్గా... పాల దిగుబడి 3.62 శాతం తగ్గింది. పరిశ్రమల రంగానికి వచ్చే సరికి మొత్తంగా 12.20 శాతం వద్ధి నమోదుకాగా... ఇందులో మైనింగ్%-%క్వారింగ్‌లో 18.43 శాతం పెరిగింది. తయారీ రంగంలో రూ.41,201 కోట్ల విలువైన జీవీ నమోదు కాగా 11.66 శాతం పెరుగుదల ఉంది. నిర్మాణం రంగంలో కూడా పురోగతి వచ్చింది. 11.81 శాతం పెరుగుదలతో జీవీఏ రూ.28.625 కోట్లకు చేరింది. విద్యుత్ ఉత్పత్తిలో 19.12 శాతం వద్ధి నమోదైంది. 26,837 మిలియన్ యూనిట్లకు ఉత్పత్తి చేరుకుంది. అలాగే విద్యుత్ వినియోగం కూడా 4.17 శాతం పెరిగింది. ఆతిథ్య రంగంలో రూ.25,292 కోట్ల విలువైన జీవీఏతో 8.50 శాతం వద్ధి నమోదైంది. ఈ రంగంలో ట్రేడ్, మాల్స్, రెస్టారెంట్లలో 6.95 కోట్ల ఫుట్ ఫాల్. రవాణా, గిడ్డంగులు తదితర విభాగాల్లో రూ.24,927 కోట్ల జీవీఏతో 5.99 శాతం వద్ధి. 21.55 లక్షల వాణిజ్య వాహనాల రిజిస్ట్రేషన్ జరిగాయి. జల రవాణా ద్వారా 52.50 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ జరిగింది. అలాగే ఈ త్రైమాసికంలోనే 14.98 లక్షల మంది విమానాల్లో ప్రయాణించారు. రియల్ ఎస్టేట్ రంగంలో రూ.32,951 కోట్లతో 14.31 శాతం పెరుగుదల నమోదు. 2014%-%19 మధ్య జీఎస్డీపీ వద్ధి 13.49 శాతంగా నమోదు కాగా... 2019%-%24 మధ్య జీఎస్డీపీ 10.32 శాతానికి పడిపోయింది. మళ్లీ 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి ఏడాది 2024%-%25లో రూ.15.93 లక్షల కోట్లతో 12.02 శాతానికి జీఎస్డీపీ పెరిగింది. అదే సమయానికి జాతీయ జీడీపీ వద్ధి 9.8 శాతంగా ఉంది. 2019%-%24 మధ్య వద్ధి రేటు పడిపోవడంతో రూ.7 లక్షల కోట్ల జీఎస్డీపీ రాష్ట్రం నష్టపోయింది. 2014%-%19 వద్ధి రేటు తర్వాత కాలంలోనూ కొనసాగి ఉంటే అదనంగా రూ.76,195 కోట్ల ఆదాయం వచ్చి ఉండేది. తలసరి ఆదాయంలో కూడా ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపించింది. 2014%-%2019 మధ్య 13.21 శాతం పెరగ్గా... 2019%-%24 మధ్య 9.8 శాతం మాత్రమే పెరిగింది. 2024%-%25 ఆర్థిక సంవత్సరంలో 11.89 శాతం మేర తలసరి ఆదాయంలో పెరుగుదల నమోదైంది. రాష్ట్రంలో తలసరి ఆదాయం 2018%-%19లో రూ.1,54,031 ఉండగా, 2023%-%24 నాటికి రూ.2,37,951కి మాత్రమే పెరిగింది. 2024%-%25 కల్లా ఇది రూ.2,66,240కి తీసుకువచ్చాం. ఇదే సమయంలో జాతీయ తలసరి ఆదాయం రూ.2,05,324గా ఉంది. 2014%-%19 మధ్య నమోదైన 13.49 శాతం వద్ధి రేటు కొనసాగితే... స్వర్ణాంధ్ర%-%2047 లక్ష్యం నాటికి రూ.292 లక్షల కోట్ల జీఎస్డీపీ, రూ.49 లక్షల తలసరి ఆదాయం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి.

## తెలుగు రాష్ట్రాల్లో చలి పులి పంజా

**హైదరాబాద్:** దేశ వ్యాప్తంగా చలి గాలుల తీవ్రత పెరుగుతోంది. పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు అంతకంతకూ పడిపోయి సింగిల్ డిజిట్‌కి రావడానికి సిద్ధంగా ఉన్నాయి. రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో ప్రస్తుతం ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదు అవుతున్నాయి. ఇదే పరిస్థితి ఉత్తరాది రాష్ట్రాల్లో కొనసాగుతోంది. ఇక తెలుగు రాష్ట్రాల్లో కూడా చలి పులి పంజా విసురుతుంది. ఉత్తరాది నుంచి చలిగాలుల తీవ్రత పెరుగుతుంది. ఉత్తర తెలంగాణకు కోల్డ్ వేవ్ ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని,, చలి బారి నుంఇ కాపాడుకునే అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచిస్తున్నారు. హైదరాబాద్‌లో చలి మరింత పెరిగే అవకాశం ఉంది. ఇక ఏపీలో కూడా దాదాపు ఇదే పరిస్థితి ఉంది. సముద్ర తీర ప్రాంతాలు, గోదావరికి అత్యంత సమీపంలో ఉండే గ్రామాల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే పర్యాటక ప్రదేశాలైన లంబసింగి, పాడేరు, అరకుల్లో చలి తీవ్రత బాగా పెరిగిపోయింది. చలి తీవ్రతకు ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ఉదయం, రాత్రి సమయాల్లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి.

## పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరించారు

-మొదటిపేజీ తరువాయి

ఈ చిన్న విషయాన్ని రాజకీయం చేయాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. పవన్ కల్యాణ్‌కు తెలంగాణ ప్రజలపై ఎంతో ప్రేమ, నమ్మకం ఉన్నాయని నాదెండ్ల గుర్తుచేశారు. గతంలో అనేక సందర్భాలలో ఆయన తెలంగాణ ప్రజలను, వారి పోరాట స్ఫూర్తిని ప్రశంసించారని తెలిపారు. కాబట్టి, ఈ వ్యాఖ్యలను అపార్థం చేసుకోవద్దని, దీనిపై వివాదం సృష్టించవద్దని మంత్రి నాదెండ్ల కోరారు.

## మీ నిర్ణయాలు భేష్...

-మొదటిపేజీ తరువాయి

రద్దు కావడంతో దేశవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ అంశంపై కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా రామ్మోహన్ నాయుడు విమర్శలను ఎదుర్కొన్నారు. అయితే, ప్రస్తుతం పరిస్థితి క్రమంగా అదుపులోకి వస్తోంది. ఈ సంక్షోభంపై కేంద్రం తీసుకుంటున్న చర్యల గురించి మంత్రి రామ్మోహన్ నాయుడు నేడు రాజ్యసభలో వివరణ ఇచ్చారు. ఈ తరుణంలో స్వయంగా ప్రధాని మోదీయే ఆయనను ప్రశంసించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# భోగాపురం అలా... విజయవాడ ఇలా

**విజయవాడ :** భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం 2026 జూన్‌కు మొదటి దశ పూర్తి చేసి విమానాలు రన్‌వేలో ల్యాండ్ చేసేందుకు సిద్ధమవుతుంటే, కృష్ణా జిల్లా గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ నిర్మాణం మాత్రం ఏళ్లకేళ్లు సాగుతోంది. ఐదున్నరేళ్ల క్రితం రూ.470 కోట్ల బడ్జెట్‌తో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనం పనులు మొదలయ్యాయి. 30 నెలల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు. కానీ 68 నెలలు దాటినా ముగిసే పరిస్థితిలో లేదు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్ ను ఉఓఖీ గ్రూప్ నిర్మిస్తోంది. రూ.4,590 కోట్లతో వేగంగా పనులు పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే 90 శాతానికిపై పనులు పూర్తి అయ్యాయి. వచ్చే నెలలో విమానాల ట్రయల్ రన్స్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. 2,800 ఎకరాల్లో 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం, అంతర్జాతీయ సర్వీసులు, కార్గో హబ్‌గా మారేందుకు సిద్ధమవుతున్న ఈ ప్రాజెక్ట్, ఉత్తరాంధ్ర కు మైలురాయిగా మారనుంది. గన్నవరం విమానాశ్రయం టెర్మినల్ మాత్రం ఆలస్యంగా జరుగుతోంది. 2019లో మొదలైన టెర్మినల్ నిర్మాణం, లోపలి సిమెంట్ స్ట్రక్చర్ పూర్తయినా, వెలుపలి స్టీల్ ఫ్రేములు, గ్లాస్ ఫాసాడ్ పనులు మాత్రం సాగుతున్నాయి. తాజా అంచనాల ప్రకారం, మరో ఆరు నెలలు పట్టే అవకాశం ఉంది. అంటే 2025 జూన్ లక్ష్యం కూడా దాటిపోతుంది. ఈ జాప్యం వల్ల రన్‌వే విస్తరణ చేసినా నిరుపయోగంగా పడిపోయింది. ఢిల్లీ, ముంబైకి మాత్రమే బోయింగ్ సర్వీసులు పరిమితమయ్యాయి. అంతర్జాతీయ ఫ్లైట్లు, పెద్ద ఎయిర్‌లైన్స్ సర్వీసులు ఆలస్యమవుతున్నాయి. విజయవాడ?హైదరాబాద్ రూట్‌లో ట్రాఫిక్ పెరిగినా దానికి తగ్గట్లుగా చర్యలు తీసుకోలేకపోతున్నారు. కేంద్ర ఏవియేషన్ మంత్రి కి రామ్మోహన్‌నాయుడు స్వయంగా రెండుసార్లు విజయవాడకు వచ్చి పరిశీలించారు. పనులు ఆలస్యంగా చేస్తున్న కాంట్రాక్టర్ ను హెచ్చరించారు. ఏడాదిన్నరలో కొత్త గడువులు పెట్టారు, 2025 జూన్ డెడ్‌లైన్‌లు జారీ చేశారు. కానీ పనులు మాత్రం ఊపందుకోవడం లేదు. నిర్లక్ష్యం ఎందుకన్న విమర్శలు ప్రజల నుంచి వస్తున్నాయి.

# ప్రజలు స్వేచ్ఛగా పిటీషన్లు అందజేయండి...

- చట్టపరిధిలో పరిష్కారం చూపుతాం
- జిల్లా ఎస్పీ పి.జగదీష్
- జిల్లా పోలీస్ కార్యక్రమానికి 128 పిటీషన్లు





**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం డిసెంబర్ 8 :** అనంతపురం జిల్లాలోని ప్రజలు పోలీస్ శాఖకు స్వేచ్ఛగా ఫిర్యాదులు ఇవ్వాలని చట్టపరిధిలో వారి సమస్యలకు పరిష్కారం చూపుతామని జిల్లా ఎస్పీ పి జగదీష్ జిల్లా ప్రజలకు భరోసా ఇచ్చారు. జిల్లా పోలీస్ శాఖ ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలనే లక్ష్యంతో PGRS (Public Grievance Redressal System) కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. ఈ క్రమంలో సోమవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆధ్వర్యంలో PGRS నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఎస్పీ గారు ప్రతి పిటిషన్‌ను వ్యక్తిగతంగా పరిశీలించి, సమస్యల స్వరూపాన్ని మరియు తీవ్రతను తెలుసుకున్నారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ:**
పోలీస్ శాఖ ప్రజాసేవనే ధ్యేయంగా తీసుకుని, ప్రతి బాధితుడికి న్యాయం అందే వరకు కృషి చేస్తుందన్నారు ప్రజలు భయపడకుండా, ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలన్నారు .


PGRS కార్యక్రమం ద్వారా వచ్చిన పిటిషన్లు పారదర్శకంగా నమోదు చేసి, నిర్దిష్ట వ్యవధిలో పరిష్కార చర్యలను కొనసాగిస్తామన్నారు సామాజిక సమస్యలు, కుటుంబ కలహాలు, భూ వివాదాలు, మహిళల భద్రత, సైబర్ మోసాలు, ట్రాఫిక్ సమస్యలు వంటి అన్ని అంశాలపై పోలీస్ శాఖ 24 గంటలు సేవలందిస్తుందని తెలిపారు.లి అలాగే జిల్లా శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొంటూ, అనుమానాస్పద వ్యక్తులు, సంఘటనలు గమనించినప్పుడు వెంటనే సంబంధిత పోలీసులకు లేదా డయల్ 100/112 కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఈకార్యక్రమంలో అనంతపురం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

- : ఈనెల 21వతేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టాలి
- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్





**అంకుశం న్యూస్ అనంతపురం, డిసెంబర్ 08 :** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ స్వీకరించారు.

- జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జున, తిప్పేనాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 498 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు.

- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. అర్జీలను గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలని, ఇందులో ఎలాంటి అలస్వతం ఉండరాదన్నారు. ఎలాంటి పెండింగ్ ఉంచుకుండా బియాండ్ ఎస్ఎల్ఏలను పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతిరోజు మానిటర్ చేస్తూ అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

**ఈనెల 21వతేదీన పల్స్ పోలియో కార్యక్రమం కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టాలి :**

- ఈనెల 21వతేదీన వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 2,84,774 మంది చిన్నారులు (0-5 సంవత్సరాల మధ్య) ఉన్నారని, జిల్లాలోని 31 మండలాల పరిధిలో 51 పిహెచ్సిలు, 25 యూపీహెచ్సీలు, 6 పిపియూనిట్లు కలుపుకుని మొత్తం 82 యూనిట్లలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించాలన్నారు.

- ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఎల్డిఎం నరేష్ రెడ్డి, డిపిఓ నాగరాజునాయుడు, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఎపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, డిఎండబ్ల్యుఓ రామసుబ్బారెడ్డి, జిల్లా టూరిజం అధికారి జయకుమార్ బాబు, పిఆర్ ఎస్ఈ సుబ్బరాయుడు, సివిల్ సప్లయ్ డిఎం రమేష్ రెడ్డి, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు రియాజుద్దీన్, వసంతలత, యుగేశ్వరిదేవి, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాజులూరు మండలంలో పలుఅభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన మంత్రి సుభాష్

## - గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి





**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ డిసెంబర్ 08:** దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం కోలంక గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి సుభాష్ శ్రీకారం చుట్టారు. గ్రామాల పరిశుభ్రత, పారిశుధ్యం కోసం ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా మంజూరైన 5 ట్రాక్టర్లు, ట్రక్కులు మంత్రి స్వయంగా ప్రారంభించి ఆయా పంచాయతీలకు అందజేశారు. మండలంలోని కోలంక, శీల, మంజేరు, కుయ్యేరు, దుగ్గుదూరు గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు అందజేశారు. రామచంద్రపురం నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి సుభాష్ వెల్లడించారు. నియోజకవర్గానికి మరిన్ని నిధులు త్వరలో మంజూరు కానున్నాయని పేర్కొన్నారు.

కోలంక గ్రామంలో ఆర్ అండ్ బి పరిధిలో రూ. 85 లక్షల అంచనాతో నిర్మించనున్న సీసీ, బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి సుభాష్ శంకుస్థాపన చేశారు. అదే గ్రామంలో రూ.8 లక్షలతో నూతనంగా నిర్మించిన త్రాగునీరు పైపులైను, పంపు హౌస్, అలాగే రూ.2.80 లక్షలుతో ఏర్పాటుచేసిన త్రీఫేస్ ట్రాన్స్ఫార్మర్ ను మంత్రి సుభాష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె. రాంబాబు, డిప్యూటీ ఎంపీడీవో లు చక్రపాణి, ఎం సత్యనారాయణమూర్తి, ఆరడబ్ల్యూఎస్ ఏ ఈ, కాజులూరు మండల టిడిపి అధ్యక్షులు చవ్వా కుల నారాయణమూర్తి( డాక్టర్ బాబు) జనసేన అధ్యక్షులు బొండా వెంకన్న, సర్పంచ్ గుబ్బల మౌనిక నాగరాజు, సెక్రటరీ ఎస్ చంద్రశేఖర్, ఏపీవో వెంకటలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పద్మ రూప, ఆర్ అండ్ బి ఏ ఈ ప్రసన్న, ఎలక్ట్రికల్ ఏఈ వీర్రెడ్డి, చుండ్రు వీర్రాజు చౌదరి, వనుం వీరబ్రహ్మం, దంతులూరి వంశీ, దాట్ల బుచ్చిబాబు, మేడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ, డీసీ విజయ గోపాల్ రాజు, వంశీ రాజు, బొండా రామకృష్ణ, కోలంక సొసైటీ అధ్యక్షులు, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

# అనంతలోఈనెల 10వతేదీ నుంచి 21వతేదీ వరకు టెట్ పరీక్ష

- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అంకుశం న్యూస్ అనంతపురం, డిసెంబర్ 08 :** ఈనెల 10వతేదీ నుంచి 21వతేదీ వరకు టెట్ (ఏపీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఏపీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ పై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏపీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ - అక్టోబర్ 2025ను ఈనెల 10వతేదీ నుంచి 21వతేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం జిల్లాలో 7 కేంద్రాలను ఎంపికచేయడం జరిగిందన్నారు. టెట్ పరీక్ష ప్రతిరోజు రెండు సెషన్లలో నిర్వహించడం జరుగుతుందని, సెషన్ వన్ ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు, సెషన్ 2 మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలీస్, డిఆర్ఓ, సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ ఏపీ ఎస్పీడీసీఎల్, ఏపీఎస్ఆర్టీసీ, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, పోలీస్ బందోబస్తు నిర్వహించాలని, అభ్యర్థుల కోసం ఆర్టీసీ వారు సరిపడే బస్సులు ఏర్పాటు చేయాలని, కేంద్రాలలో మెడికల్ అండ్ హెల్త్ వారు ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆయా అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టాలని టెట్ పరీక్షలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జున, తిప్పేనాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డిఈఓ ప్రసాద్ బాబు, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సినీ నిర్మాత చలసాని రామబ్రహ్మం చౌదరి కినివాళులర్పించిన ఎంపీ కేశినేని శివనాథ్.





**అంకుశం న్యూస్ విజయవాడ డిసెంబర్ 8:** ప్రముఖ సినీ నిర్మాత చలసాని రామబ్రహ్మం చౌదరి దశదిన కర్మ కార్యక్రమం పామర్రు నియోజకవర్గం పామర్రు మండలం పెదమద్దాలి గ్రామంలోని వారి నివాసం వద్ద ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ కేశినేని శివనాథ్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా హాజరయ్యారు. వీరంతా నిర్మాత చలసాని రామబ్రహ్మం చౌదరి చిత్ర పటానికి పూలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. చలసాని రామబ్రహ్మం చౌదరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. చలసాని రామబ్రహ్మం చౌదరి భార్య చలసాని శ్రీదేవి, కుమార్తె శ్రేయ తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ, ఎమ్మెల్యేలు వారికి ధైర్యం చెప్పి సాంత్వన అందించారు. రామబ్రహ్మం చౌదరి కి కళలపై ఉన్న అంకితభావం, ఆయన మానవత్వం ఎప్పటికీ జ్ఞాపకాలలో నిలిచిపోతాయని స్మరించుకున్నారు.

# బాల్య వివాహాలు జరగడానికి వీల్లేదు కఠినంగా వ్యవహరించండి

- బాల్య వివాహ రహితంగా శ్రీ సత్యసాయి జిల్లాను తీర్చిదిద్దుదాం
- జిల్లా కలెక్టర్ శ్రీ శ్యామ్ ప్రసాద్‌లి
- బాల్యవివాహాలపై 1098 కు ఫిర్యాదు చేయవచ్చు





**అంకుశం న్యూస్ పుట్టపర్తి డిసెంబరు 8:** బాల్య వివాహ రహితంగా శ్రీ సత్యసాయి జిల్లాను తీర్చిదిద్దడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ శ్రీ శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు.

సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్ నందలి పీజిఆర్ఎస్ హాలులో బాల్య వివాహ ముక్త భారత్ - 100 రోజుల కార్యక్రమం లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో.. మహిళాభివృద్ధి & శిశు సంక్షేమ శాఖ రూపొందించిన "బాల్య వివాహం ఆపుదాం - దేవుని కృపను పొందుదాం"అనే నినాదంతో తయారుచేసిన బాల్య వివాహాల వ్యతిరేక గోడపత్రికను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ... శ్రీ సత్యసాయి జిల్లాను పూర్తిగా బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి అధికారి, స్వచ్ఛంద సంస్థ, గ్రామస్థాయి సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలి. బాల్య వివాహం ఒక తీవ్ర సామాజిక సమస్య. ఇది బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందుకే ఎక్కడైనా బాల్యవివాహం జరిగే ప్రయత్నాలపై కఠిన చర్యలు తీసుకోవాలి అని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతుందని సమాచారం అందినా, తెలిసినా 1098 కు ఫిర్యాదు చేయవచ్చు. అలాగే మండల స్థాయి స్పెషల్ ఆఫీసర్లు తమ పరిధిలో బాల్య వివాహాలు జరగకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో బాల్య వివాహ వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో విస్తృతమైన అవగాహన తీసుకురావాలని, ఆర్టీసీ బస్సులపై కూడా బాల్య వివాహాల వ్యతిరేక పోస్టర్లు అతికించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం జిల్లా అధికారులు అందరూ కలిసి బాల్య వివాహాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్‌డీఓ సువర్ణ, ఐసిడిఎస్ పీడీ ప్రమీల, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఈవో క్రిష్టప్ప, డీసీపీవో మహేష్, ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీధర్, సోషల్ వర్కర్ ఆనంద్ మరియ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ధర్మవరం 38వ వార్డు టిప్పు సుల్తాన్ మిత్రబృందం బీజేపీలో చేరిక !

- బీజేపీ పట్ల ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసం - 38వ వార్డు తాజా చేరికలతో స్పష్టం



**అంకుశం న్యూస్ ధర్మవరం, డిసెంబర్ 08:** . ధర్మవరం పట్టణం 38వ వార్డుకు చెందిన టిప్పు సుల్తాన్, వారి స్నేహితులు, సన్నిహితులు, మిత్రబృందం భారతీయ జనతా పార్టీ ధర్మవరం నేత జమీర్ ఆధ్వర్యంలో సోమవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిన్న సభలో మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో హరీష్ బాబు మాట్లాడుతూ హరీష్ బాబు,..... టిప్పు సుల్తాన్ మరియు వారి స్నేహితులు భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి దిశ, ప్రధానమంత్రి నరేంద్రమోడీ గారి నాయకత్వం, రాష్ట్రంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి సేవా ధోరణితో ప్రేరణ పొంది పార్టీలోకి చేరడం ఆనందదాయకం. వీరి చేరికతో 38వ వార్డు బీజేపీ బలోపేతం అవుతుంది. ధర్మవరం అభివృద్ధి పథంలో మీ అందరి భాగస్వామ్యం ఎంతో కీలకం అని తెలిపారు.

అలాగే, టిప్పు సుల్తాన్, వారి మిత్రబృందం పార్టీ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్న నమ్మకం ఉంది. మన ప్రియతమ నాయకులు, ధర్మవరం సభ్యులు, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి తరపున వీరందరికీ హృదయపూర్వక స్వాగతం తెలియజేస్తున్నాను అని హరీష్ బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబులేష్, పట్టణ అధ్యక్షులు చంద్ర, రూరల్ మండల అధ్యక్షులు చంద్ర, మైనార్టీ నాయకులు జమీర్, నబీరసూల్, చిన్న లింగమయ్య, వద్దే శినా, బోయ నరసింహులు, బిల్లే శ్రీనివాసులు, పోతుకుంట రాజు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రకాష్ రెడ్డి ఇలా మాట్లడటానికి సిగ్గుండాలి..

- ఎమ్మెల్యే పరిటాల సునీత
- 9మంది ఎంపీటీసీలు ఉన్నారు.. ఎంపీపీ ఎన్నికకు రాలేవు
- సొంత గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మించలేవు.. ఎందుకీ చేతకాని మాటలు
- క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలతో సమావేశం





**అంకుశం న్యూస్ అనంతపురం డిసెంబర్ 8:** 9మంది ఎంపీటీసీలు ఉండి కూడా ఎంపిపి ఎన్నికకు రాలేవు.. సొంత గ్రామంలో సబ్ స్టేషన్ పూర్తి చేయలేవు.. కానీ మాటలు మాత్రం కోటలు దాటుతాయంటూ మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి పై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల్ని కలిశారు. తమ వ్యక్తిగత, గ్రామాల్లోని సమస్యలను చెప్పుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రతి ఒక్కర్నీ ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు పరిటాల శ్రీరామ్ కూడా కలిశారు. చదువు, ఇల్లు, విద్యుత్, స్థల వివాదాలు, దేవాలయాలు, చర్చిల నిర్మాణాలు వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వీటిలో చాలా వాటికి అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపారు. కక్కలపల్లి కాలనీలో యానిమేటర్ దాదాపుగా 29 లక్షలు కాజేశారని కొందరు ఫిర్యాదు చేశారు. సదరు యానిమేటర్ వైసీపీ ప్రభుత్వం నుంచి కొనసాగుతూ ఉన్నారని.. ఇలా డబ్బు కాజేశారని అడిగితే దురుసుగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రీన్యూ కంపెనీ సిబ్బందితో సమావేశం నిర్వహించి.. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సహకరించాలని కోరారు. ఇటీవల ప్రకాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యల మీద ఆమె తీవ్రంగా స్పందించారు. సొంత మండలంలో రెండు సబ్ స్టేషన్లు పూర్తి చేసే అవకాశం ఉన్నా.. పని చేయకుండా పక్క మండలాల్లో నేనే సబ్ స్టేషన్లు నిర్మించానని చెప్పుకుంటున్నారని విమర్శలు చేశారు. సొంత గ్రామంలో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోకుండా..ఇప్పుడు మేము సబ్ స్టేషన్ పూర్తి చేస్తే దానిపై కూడా విమర్శలు చేస్తున్నారన్నారు. వాస్తవంగా ఈవిషయంలో తోపుదుర్తి ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. మరోవైపు రామగిరి ఎంపీపీ ఎన్నిక విషయంలో ప్రకాష్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు మీద ఎమ్మెల్యే సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. 9మంది ఎంపీటీసీలు ఉండి కూడా ఎంపీపీ ఎన్నిక కోసం ఎంపీడీఓ కార్యాలయానికి కూడా రాలేని దద్దమ్మ ప్రకాష్ రెడ్డి అన్నారు. ఇప్పటికే నాలుగు సార్లు ఎన్నిక వాయిదా పడిందన్నారు. పైగా తామేదో దౌర్జన్యం చేస్తున్నట్టు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎంపీపీ లేకపోవడం వలన మండలంలో చేపట్టాల్సిన పనులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. తాము దౌర్జన్యం చేయాలనుకుంటే.. ప్రకాష్ రెడ్డికి ఆపే శక్తి లేదన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఏదైనా జరగాలని మేము భావిస్తున్నామన్నారు. ఇప్పటికైనా చేతకాని మాటలు మానుకోవాలని ఎమ్మెల్యే సునీత హితవు పలికారు...

# వచ్చేది వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వమే

## -మాజీఎమ్మెల్యే సత్తి సూర్య నారాయణ రెడ్డి

- జాతరను తలపించేలా రాజుపాలెం గ్రామంలో ఎస్సీల మహాజన సభ





**కాకినాడ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ డిసెంబర్ 08:** వచ్చేది వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వమేనని పార్టీ శ్రేణులంతా సమరోత్సాహంతో పని చేయాలని అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యులు, డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి రాజుపాలెం లంక గ్రామంలో సత్యా కల్యాణమండపం నందు ఎస్సీ సెల్ మహాజన సభ ఘనంగా జరిగింది. నూతనంగా మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన సుందరపల్లి వీరభద్రరావు అభినందన సమావేశంబీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, గోపాలపురం - రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గాల పరిశీలకుడు అద్దంకి ముక్తేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, శ్రీమతి ఆదిలక్ష్మి దంపతులు హాజరయ్యారు. డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన చేయూత, ఫీజు రియంబర్స్మెంట్, రైతులకు ఉచిత పంటల బీమా తదితర అనేక సంక్షేమ పథకాలను నిలిపివేసిందన్నారు. నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలపై దాడులు పెరిగిపోయాయన్నారు. దోమాడలో రోడ్డు పక్కన గుడిసెలను, కుతుకులూరులో నిరుపేదలైన ఎస్సీలను లక్ష్యంగా చేసుకుని ఇళ్లను స్థానిక శాసనసభ్యుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కూల్చివేశారని మండిపడ్డారు. పేదల ఇళ్లు కూల్చిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికలలో జగన్ మెహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని, దౌర్జన్యాలకు పాల్పడిన కూటమి నేతల లెక్కలు సరిచేస్తామని, ఆ దెబ్బకు అక్రమార్కులు గ్రామాలు, జిల్లాను కాకుండా రాష్ట్రాన్ని కూడా విడిచి పారిపోతారని ఆయన హెచ్చరించారు. కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు ఇస్తానని, అధికార పార్టీ దౌర్జన్యాలకు ఎవరు భయపడవలసిన అవసరం లేదని ఆయన భరోసానిచ్చారు. మహాజన సభకు నియోజకవర్గంలో ఇంత భారీగా ప్రజలు రావడం పార్టీ అధికారంలోకి రావడానికి సంకేతమన్నారు.

## టిడ్కో అపార్ట్మెంట్లు వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ డిసెంబర్ 08:** మండపేట టిడ్కో అపార్ట్మెంట్లు వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గవర్నమెంట్ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా వైసీపీ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండపేటలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పిలుపుమేరకు చేస్తున్న కోటి సంతకాల ఉద్యమంలో భాగంగా టిట్కో అపార్ట్మెంట్లు వద్ద ప్రజల మద్దతు కోరుతూ ప్రతి గడపగడపకు వెళ్ళి ప్రైవేటీకరణ నష్టాలు వివరించారు.పిల్లల భవిష్యత్తు, నిరుపేద కుటుంబీకుల ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వైద్యం విషయంలో తీవ్రమైనటువంటి అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పుడే ప్రజలు మేల్కొని కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ఖండించాలని దుర్గారాణి పేర్కొన్నారు.ప్రజల మద్దతును కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పిల్లి శ్రీనివాస్, జిల్లా పార్టీ జనరల్ సెక్రెటరీ యర్రగుంట అయ్యప్ప, షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీ ఖాన్ బాబా, యువజన విభాగం జిల్లా సెక్రెటరీ కోణాల చంద్ర బోస్, కొమ్మోజు నాగేశ్వరరావు, గునుపే భూషణం, తుమ్మ శ్రీనివాస్, నియోజకవర్గం ఐ.టి విభాగం కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది





- తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయి విచారంలో మునిగిన అక్షిత, వందన
- అనాథలైన ఇద్దరు ఆడపిల్లలకు మంత్రి సవితమ్మ ఆపన్నహస్తం

**అంకుశం న్యూస్ పెనుకొండ డిసెంబర్ 8:** శ్రీ సత్యసాయి జిల్లా పరిగి మండల కేంద్రం కు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త భజంత్రి గోపాల్ (45) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు.. ఎనిమిదేళ్ల క్రితం భార్యను కోల్పోయారు.అనాథలైన ఇద్దరు ఆడబిడ్డలను పరామర్శించిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి వర్యులు శ్రీమతి సవిత గారు .పెద్ద కుమార్తె అక్షిత, హిందూపురం సువర్ణ భారతీ జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.రెండవ కుమార్తె వందన, పరిగి కెజిబివి పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఆర్థిక సహాయంతో పాటు ప్రభుత్వం అండగా నిలబడుతుందని భరోసా ఇచ్చారు. ఏ పరిస్థితిలోనూ ఇద్దరు విద్య మానుకోకుండా బాగా చదువుకోవాలని తెలిపారు.

**కాలేజీ యాజమాన్యం నుంచి భరోసా - విద్య, భవిష్యత్ వైద్యవిద్యకు సహాయం.**

అక్షిత చదువుతున్న సువర్ణ భారతీ జూనియర్ కళాశాల యాజమాన్యంతో మంత్రి సవితమ్మ మాట్లాడారు. కాలేజీ ఫీజుల పూర్తిగా తగ్గిస్తామన్నారు., భవిష్యత్తులో అక్షిత వైద్యవిద్య చేసేందుకు అవసరమైన సహాయం అందిస్తామని కళాశాల యాజమాన్యం హామీ ఇచ్చింది.ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

## తిరుపతి సంస్కృత వర్సిటీ ఘటనపై పార్లమెంటులో ఎంపీ గురుమూర్తి వాయిదా తీర్మానం




తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో చోటుచేసుకున్న లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిల్, డ్రగ్స్ ఘటనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మద్దిల గురుమూర్తి లోక్‌సభలో అడ్జర్న్‌మెంట్ మోషన్ నోటీసు ఇచ్చారు. బీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్న దళిత విద్యార్థినిని అదే వర్సిటీలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ లైంగికంగా వేధించడం, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని బెదిరించడం అత్యంత హేయమని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాల్సిన గురువులే ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడటం తిరుపతి ప్రతిష్టకు దెబ్బతీస్తోందని ఎంపీ పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా, వర్సిటీ హాస్టల్ తనిఖీల్లో 20 గంజాయి ప్యాకెట్లు బయటపడటం క్యాంపస్ భద్రతా వ్యవస్థ పూర్తిగా విఫలమైందని ఎంపీ గురుమూర్తి అన్నారు. సెంట్రల్ యూనివర్శిటీలో విద్యార్థులు మాదకద్రవ్యాలకి లోనవడం అత్యంత ఆందోళనకరమని, దీనివల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆయన పేర్కొన్నారు. బాలికలు మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు రక్షణ లేకపోవడం అత్యంత బాధాకరమని సూచించారు. ఈ ఘటనలపై వెంటనే ఉన్నత స్థాయి విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, క్యాంపస్ భద్రతను బలోపేతం చేసి డ్రగ్-ఫ్రీ వాతావరణాన్ని ఏర్పరచాలని ఎంపీ గురుమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు.

## కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర ఆదేశాలతో దాతృత్వం చాటుకున్న వడ్లమూడి





**కనిగిరి డిసెంబర్ 8 అంకుశం న్యూస్:** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన గొల్లపల్లి శేషయ్య (46) ఇటీవల గుండెపోటుతో చెన్నైలోని వైద్యశాలలో మరణించారు. శేషయ్య సతీమణి గొల్లపల్లి ఎలిశమ్మ రోజువారి కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఎలిశమ్మ భర్త గొల్లపల్లి శేషయ్య గుండెపోటుతో హఠాన్మరణం చెందడంతో వారి కుటుంబానికి కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలతో విఎన్ఆర్ మైన్స్ అండ్ మినరల్స్ అధినేత వడ్లమూడి నాగేంద్రబాబు 50 వేల రూపాయల నగదును ఎలిశమ్మ కు వడ్లమూడి నాగేంద్రబాబు సన్నిహితులు , వడ్లమూడి ప్రతినిధి మన్నెం వెంకటస్వామి,సోమవారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి ల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనరసాపురం టిడిపి నాయకులు మద్దిశెట్టి రవిశంకర్, మోపాడు తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు మోరుబోయిన గిడ్డయ్య యాదవ్, పామూరు మాజీ సర్పంచ్ కావిటి వెంకటసుబ్బయ్య, విఎన్ఆర్ మేనేజర్లు సయ్యద్ బాబు, ఈర్ల ఏడుకొండలు, మోపాడు టిడిపి నాయకులు యరశింగ్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కి స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు రామకృష్ణారెడ్డి, బలరామకృష్ణ





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ డిసెంబర్ 08:** రాజమహేంద్రవరం పర్యటనకు విచ్చేసిన మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కి రాజమహేంద్రవరం ఎయిర్ పోర్ట్ లో ఘన స్వాగతం లభించింది స్వాగతం పలికిన వారిలో అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం శాసనసభ్యులు బత్తుల బాలరామకృష్ణ దంపతులు, తూర్పుగోదావరి జిల్లా బిజెపి అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, ఇంకా కొందరు ముఖ్యనేతలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

## ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎమ్. ఎల్. టి. విభాగం కోసం విరాళం అందజేసిన దాసరి హరికృష్ణ



**అంకుశం న్యూస్ ధర్మవరం డిసెంబర్ 8:** ధర్మవరం శాంతి సిల్క్స్ యాజమని దాసరి హరికృష్ణ ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎమ్. ఎల్. టి. విభాగం కోసం తన వంతు సాయం గా రూ 15 వేలు ప్రిన్సిపాల్ శ్రీ మతి ఎమ్. వనిత వాణి కి అందజేశారు. ల్యాబ్ పరికరాలు కోసం ఈ విరాళం అందజేశారు. ఈ కార్యక్రమం లో ప్రభాకర్, మల్లికార్జున, సునీత, కళాశాల కమిటీ బండి వేణుగోపాల్ ఈ బాలికల జూనియర్ కళాశాల కు దాత దాసరి హరికృష్ణ సహాయం పట్ల ప్రిన్సిపాల్ వనిత వాణి కృతజ్ఞతలు తెలిపారు.

## ధర్మవరం వై. ఎస్.ఆర్. సి.పి. ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ!



**అంకుశం న్యూస్ ధర్మవరం డిసెంబర్ 8:** ధర్మవరం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శ్రీ కేతిరెడ్డి గారి పిలుపు మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకి నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంకి మద్దతుగా 7 వ వార్డ్ లో ప్రతి ఇంటికి వెళ్లి పిపిపి విధానం పై ప్రజలకు తెలియజేస్తూ అలాగే వార్డ్ ప్రజలు అందరు పీపీపీ విధానంగాకి వ్యతిరేకంగా సంతకాలు చేసి మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 7 వ వార్డ్ ఇంచార్జ్ గద్దం రంగా, నాయకులు రవీంద్ర రెడ్డి,ఓం మునేంద్ర,చెన్నారెడ్డి, నారాయణస్వామి, గోపాల్ రెడ్డి, పల్ల బాబు,సోము, నరసింహులు,హరి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం కార్యక్రమం లో పాల్గొన్న జిల్లా బీజేపీ అధ్యక్షులు జి.ఎమ్. శేఖర్





**అంకుశం న్యూస్ ధర్మవరం డిసెంబర్ 8:** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలో శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో మాల ధరించిన స్వాములకు బిజెపి జిల్లా కార్యదర్శి డోల రాజారెడ్డి గారి ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమంలో శ్రీ సత్య సాయి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు శ్రీ గోరంట్ల మోహన్ శేఖర్ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జింక చంద్రశేఖర్,రాష్ట్ర చేనేత నాయకులు గిర్రాజు నాగేష్ ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు గోట్లురు అనిల్ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నాగరత్నమ్మ,బత్తలపల్లి మండలాధ్యక్షులు ఆకులేటి భాస్కర్, ఓంప్రకాష్, చెన్నా ఆదినారాయణ, నబిరసూల్,భూషణ, జింక ప్రవీణ్, మహేష్ ప్రజాపతి మరియు ఇతల బీజేపీ నాయకులు పాల్గొనటం జరిగినది.ఈసందర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా బీజేపీ అధ్యక్షులు జి ఎమ్. శేఖర్ ను ధర్మవరం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు.